# అడుగుల సవ్వడి

ఊరంతా గోలగోలగా వుంది. గ్రామమే అంతరించిపోతున్నదట. పట్టణం చుట్టూ వున్న గ్రామాల్లోని భూముల్ని, ఇళ్లను పెద్దపెద్దవాళ్లు కొనేస్తున్నారు. పరిశ్రమలు వస్తాయో, రావో తెలియదుగాని రైతుల భూముల్ని నయానో, భయానో లాగేసుకుంటున్నారు.

సాయంకాలపు నీరెండలో మెరిసిపోతున్న ఇంటివైపు మరోసారి తృప్తిగా చూసుకుని ఇంటిముందున్న రాతి అరుగులమీద కూర్చున్నాడు వెంకయ్య.

ఎత్తైన మట్టిదిబ్బమీద వుంది పెంకుటిల్లు. ఇంటిచుట్టూ ఆవరణలోని రకరకాల పూలమొక్కలు, చెట్లు పచ్చదనాన్ని పంచుతున్నాయి.

అరుగులమీద కూర్చుని ఆ దారిలో వచ్చిపోయేవాళ్ళను చూస్తూ, పలకరిస్తూ కాలక్షేపం చెయ్యడం వెంకయ్యకు అలవాటు.

మంగయ్య వచ్చి అరుగుమీద చేరాడు.

వెంకయ్య పక్క ఇల్లు అతనిదే! అమ్మేసుకున్నాడు. కొడుకు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ ఇల్లు కట్టుకోవడానికి డబ్బు అవసరమైతే తండ్రిమీద ఒత్తిడి తెచ్చి సొంత ఇల్లు అమ్మించేశాడు. ఢిల్లీ వెళ్లి కొడుకు దగ్గర వుండే ప్రయత్నం చేశాడుగాని మంగయ్యవల్ల కాలేదు. తిరిగివచ్చి అద్దె ఇంట్లో కాలం గడుపుతున్నాడు.

"మన ఊళ్ళో ఇప్పుడు గజం పాతికవేల రేటు పలుకుతున్నదట. నేను ఇల్లు అమ్మినప్పుడు గజం పన్నెండువేలే! అమ్ముకోకుండా వుండాల్సింది. నా మాట మా వాడు వింటే గదా! అమ్మేదాకా నా ప్రాణం తీశాడు" అన్నాడు మంగయ్య దిగాలుగా.

అమ్ముకున్న ఇంటిమీద మమకారం పోలేదు అతనికి. రోజూ ఇంటి ఆవరణచుట్టూ ప్రదక్షిణలు చేస్తాడు. ఇల్లు అమ్ముకున్నాక ఇంటి గోడలు చేతితో తాకుతూ తన్మయత్వం చెందుతాడు.

ఆ ఇల్లు కొనుక్కున్న తాయారమ్మకు మంగయ్య వాలకం నచ్చలేదు.

"ఇల్లు అమ్ముకున్నాక ఇక్కడ పడిగాపులు కాయడం ఎందుకు? ఇల్లు అమ్ముకునే హక్కేగాని, తిరిగి అదే ఇల్లు కొనుక్కునే హక్కు నీకు లేదు.... నువ్వు పెద్ద ప్లీడర్ని పెట్టుకున్నా, ఈ స్థలం నీకు తిరిగిరాదు... అదే పనిగా మా ఇంటిచుట్టూ తిరుగుతూ చికాకు కలిగించకు" మంగయ్యను చివాట్లు పెట్టింది తాయారమ్మ.

ఇల్లు పడగొట్టించేసి ఆమె షాపింగ్‌మాల్ కట్టిస్తున్నా, రావడం మానలేదు. కండువాపరుచుకుని వేపచెట్టు నీడలో పడుకునేవాడు. తాయారమ్మ విసుక్కున్నప్పుడు వెంకయ్య ఇంటి అరుగులమీద చేరేవాడు.

ఊళ్ళో అన్నీ రైతు కుటుంబాలే వుండేవి.... పట్నంతో ఏ సంబంధం లేకుండా ప్రశాంతంగా వుండేది... ఇప్పుడు ఊరు పట్నంలో కలిసిపోయింది. సిటీబస్సులు ఊళ్ళో నుంచి పోతున్నాయి.

రింగురోడ్డు పేరుచెప్పి గవర్నమెంటు కొన్ని పొలాలు లాగేసుకుంటే, భారీ పారిశ్రామిక సంస్థలు తమ భారీ చేతుల్ని పచ్చటి పొలాలపై కప్పేశాయి.... పట్నంలోని బిల్డర్లు రైతుల ఇళ్లు కొనేసి అపార్ట్‌మెంట్లు కట్టిస్తున్నారు. ఊరు నేల విడిచి ఏడంతస్తుల భవనంలోకి ఎగబాకిపోయింది.

"నీ ఇల్లు పన్నెండు సెంట్ల స్థలంలో వుంది.... అందరి కళ్ళూ నీ ఇంటిమీద పడ్డాయి.... ఎలాగొలా నీ స్థలం లాగేసుకోవాలని పట్టుదలతో వున్నారు.... నీ పరిస్థితి నాలాగే అవబోతూ వుంది" అన్నాడు మంగయ్య హెచ్చరిస్తున్నట్టు.

అతని మాటలకు తొట్రుపడ్డాడు వెంకయ్య.

"దేవుడు దిగివచ్చినా నా ఇల్లు అమ్మను"

"అట్లాగే మాట్లాడతావ్.... 'పొలం అమ్మనుగాక అమ్మను' అనేవాడివి.... అమ్మ లాంటి పొలాన్ని ఆ తాయారమ్మకు అమ్ముకున్నావుగా!" అన్నాడు మంగయ్య నోట్లో చుట్టపీక విసిరేస్తూ.

ఏ పరిస్థితుల్లో రెండెకరాల పొలాన్ని అమ్ముకున్నాడో మంగయ్యకేం తెలుసు?

గతంలోకి జారుకుంది మనస్సు.

పదేళ్ళ కిందటి సంగతి....

రెండెకరాల సొంతపొలం,, కౌలుకు తీసుకున్న ఐదెకరాల పొలంలో వరిసాగుతో తృప్తిపడలేక పోయాడు. పిల్లనిచ్చిన మేనమామ 'తమలపాకులతోట వేసుకో.... బాగా లాభాలు వస్తాయి' అని ప్రోత్సహించడంతో తాయారమ్మ దగ్గర అప్పు తెచ్చుకుని ఐదెకరాల్లో అవిశ మొక్కలు పెంచాడు.

అవి బాగా పెరిగిన తర్వాత వాటి కుదుళ్ళలో తమలపాకు పిలకలు నాటాడు. తమలపాకుల తోటల పెంపకంలో అనుభవం వున్న తుని ప్రాంతంవాళ్ళని కూలికి పెట్టుకున్నాడు.

తమలపాకుల తీగ చకచకా ఎదిగి అవిశమొక్కలను అల్లుకుపోతుంటే ఎంతో ఆనందపడ్డాడు. తుని ప్రాంతం కూలీలు బొటనవవేలుకు ఇనుపగోరు తగిలించుకుని తమలపాకులు సుతారంగా గిల్లుతుంటే దిగుబడి అంచనావేస్తూ తనకు వచ్చే ఆదాయం లెక్కలు కట్టుకున్నాడు.

తాయారమ్మను కూడా తీసుకువచ్చి బాగా ఎదిగిన తమలపాకుల తోటను చూపించాడు. అతని పక్కనే తోటంతా తిరగడానికి ఉత్సాహపడిందిగాని, అతను తమలపాకులు అమ్మేసి అప్పుతీర్చేస్తానని అనడం అస్సలు నచ్చలేదామెకు.

ఆమెకు ముప్పయ్యేళ్ళు వుండేవి అప్పుడు. యవ్వనపు పొంగులతో మిసమిసలాడుతూ వుండేది. వాళ్ళకు అప్పటికే రెండు సినిమాహాళ్ళు, బట్టలషాపు వున్నాయి.

తమలపాకుల తోటలో అతనిచుట్టూ ఆమె తిరుగుతూ వుంటే, ఆమె రాసుకున్న సెంటు పరిమళం కూడా అతన్ని వదిలివెళ్ళడంలేదు.

"మా వారు నన్నెప్పుడూ ప్రేమించలేదు. నాకున్న ఆస్తిచూసే నన్ను పెళ్లి చేసుకున్నాడు .... ఆయనకో ఉంపుడుగత్తె కూడా వున్నదని నాకు అనుమానంగా వుంది" అందామె యథాలాపంగా.

ఆ విషయాలు తనకు ఎందుకు చెబుతుందో అర్థంకాలేదతనికి ఏమోలే అనుకున్నాడు.

తోటమధ్యలో చిన్న పూరిపాక వుంది. తోట కాపలాదారుడు వాడుకుంటాడు దాన్ని. ఆ సమయంలో కాపలాదారుడు అక్కడ లేదు.

అతని చెయ్యి పట్టుకుందామె.

లక్షలతో వ్యాపారంచేసే ఆమె, కొంచెం చనువుగా మగవారితో వుండటంలో తప్పులేదనుకున్నాడు. ఆమె తన చేతిని సుతారంగా నిమిరినా ఎటువంటి వికారానికీ లోను కాలేదు.

"మా వారు నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారు" అందామె అతని భుజానికి తన భుజం రాస్తూ.

"మీరు వ్యాపారంలో మనస్సు పెట్టండి.... మీ వారి గురించి ఆలోచించకండి" అన్నాడతను.

ఆమె మెలికలు తిరిగిపోవడం, బుగ్గలు ఎర్రబడటం, తనమీదకు ఒరిగిపోవాలని ప్రయత్నించడం గమనించాడతను. ఏమీ చేయలేక కొంచెం దూరంగా జరిగి నిలబడ్డాడు.

మదనజ్వాలల్లో దహించుకుపోతోందామె.

"మీ ఆవిడ చనిపోయి పదేళ్లు అయ్యిందిగా! ఆడదాని పొందుకోసం ఆరాట పడటంలేదా?" సూటిగా అడిగింది తాయారమ్మ వెంకయ్యను.

"మా ఆవిడ స్థానం ఎవరూ భర్తీచెయ్యలేరు... పదేళ్ళ పాప వుంది.... ఆ పాపను పెంచి పెద్దచెయ్యడం నాబాధ్యత... నా సంతోషానికంటే నా బాధ్యతకే ప్రాధాన్యత మిస్తాను" అన్నాడతను.

"నా దగ్గర తీసుకున్న అప్పు తిరిగి తీర్చెయ్యనక్కర్లేదు. కావాలంటే మరికొంత సొమ్ము కూడా ఇస్తాను" మరో అస్త్రం ప్రయోగించింది.

"మన మధ్య వున్న స్నేహాన్ని గౌరవిస్తాను తాయారమ్మగారూ! శారీరక సుఖంకోసం పవిత్రబంధాన్ని చెడగొట్టను... వారం రోజులు పోయేక నేనెందుకు మీ నుండి దూరంగా జరిగానో అర్థం చేసుకుంటారు.... ఆవేశం తగ్గాక నేను చేసింది మంచి పనేనని మెచ్చుకుంటారు" అన్నాడతను.

ఆమె మొహం చిట్లించుకుంది. పెదాలు బిగుసుకుపోయాయి. అవమానంతో కుంగిపోయింది. కానీ తన కోపాన్ని బయటపెట్టలేదు.

"నువ్వు చెప్పింది కరెక్టే.... నా అంచనాయే తారుమారయింది... నువ్వు చాలా మంచివాడివి వెంకయ్యా!" అందామె. ఇహ ఆ పాక దగ్గర మరో క్షణం నిలబడలేదు తాయారమ్మ.

వెంకయ్య అంచనాలు కూడా తారుమారయ్యాయి. లాభం వస్తుందనుకున్న తమల పాకులతోట కుప్పకూలిపోయింది తుఫాను దాటికి. ఆకులన్నీ కుళ్ళి, పనికిరాకుండా పోయాయి.

అదే విషయం తాయారమ్మకు చెప్పాడు. అప్పుతీర్చడానికి మరికొంత సమయం కావాలని అడిగాడు. పీకలమీద కూర్చుని తన అప్పు తీర్చేయమని అంటుందేమోనని భయపడ్డాడు.

"ఫరవాలేదు వెంకయ్యా! నీ దగ్గర డబ్బులు ఎక్కడికిపోతాయి.. బ్యాంక్‌లో వున్నట్లే! సమకూరినపుడే ఇద్దువుగానిలే!" నవ్వుతూ అంది.

అప్పుడే ఓ అర ఎకరం అమ్మి అప్పు తీర్చేస్తే సరిపోయేది... తనే పొరపాటు చేశాడు.

ఐదేళ్లు గడిచిపోయాయి. అప్పు తీర్చెయ్యమని ఆమె అడగలేదు. అసలు కంటే వడ్డీ పెరిగిపోయింది. మరో ఐదేళ్లు గడిచాక లాయరు నోటీసు ఇచ్చింది. తన బాకీ వడ్డీతో సహా చెల్లించమని.

రెండెకరాలు ఆమెకు రాసివ్వక తప్పలేదు.

ఆమె కళ్ళల్లో కసి ఇంకా తగ్గలేదు. తనను పాతాళానికి నెట్టివేసేటట్లున్నాయి ఆ చూపులు.

మంగయ్య అన్నట్లు తన ఇల్లు కూడా లాగేసుకుంటుందేమో! ఎలా తీసుకుంటుంది? ఆమెకు ఒక్క పైసా కూడా బాకీలేదు. ఆమె అప్పుడప్పుడూ పలుకరించినా మాట్లాడటం మానేశాడు.

ఇల్లు తన ప్రాణం.... ఆ ఇల్లు తండ్రి చెమటచిందిస్తూ కట్టించినది. ఇంటి నిర్మాణం తమ ప్రత్యక్షంగా చూశాడు... తాపీమేస్త్రీకి ఇటుకలు అందించాడు. ఇంటిపనిలో వారు సాయపడుతుంటే తనూ చిన్న చిన్న పనులు చేసేవాడు.

తను చిన్నప్పుడు నాటిని మొక్కలు ఇప్పుడు పెద్ద వృక్షాలై తనకి నీడను, పళ్లనూ ఇస్తున్నాయి... ఇంటి చుట్టూ ఎదిగిన పచ్చిక బయలు నేత్రానందం కలిగిస్తోంది. పూలమొక్కలు తలలు ఊపుతూ శుభాకాంక్షలు చెబుతూ వుంటాయి.

ఇంట్లో అమ్మా, నాన్నా అడుగుల సవ్వడి తనకు ఇప్పటికీ వినిపిస్తూ వుంటుంది.

నాన్న రూపం కళ్ళలో మెదిలింది....

ఆరడుగుల మనిషి, బుర్రమీసాలతో గంభీరంగా వుండేవాడు. ఎప్పుడూ నోట్లో లంక పుగాకు చుట్ట వెలుగుతూ వుండేది. రోజూ పొలంలోకి వెళ్లి వచ్చేవాడు. పొలం పనులు వున్నా, లేకపోయినా, పొలంకేసి వెళ్లని రోజు నిద్రపట్టేది కాదు.

గొడ్లని కాలువకి ఆయనే తోలుకువెళ్ళేవాడు. అరవయ్యేళ్ళు పైబడ్డా,కాలువలో దిగి పశువుల్ని కడగటం, ఈతకొట్టడం మానలేదు.

"ఎన్ని ఇబ్బందులు వచ్చినా పొలం, ఇల్లు అమ్మకురా! తాతముత్తాతలనాటిది.... గడ్డ అమ్ముకుంటే మనకు విలువ వుండదు" అనేవాడు.

పొలంమీద నాన్నకు వున్న మమకారం గమనించి ఆయన చివరిక్షణాల్లో తనోమాట అన్నాడు, "పొలానికి అనుకున్న దిబ్బమీద మీరు చనిపోయాక అక్కడ పూడ్చి సమాధి కట్టిస్తాను."

"అలా చెయ్యకురా తండ్రీ! రుద్రభూమిలో అంత్యక్రియలు జరిగితేనే శివుడి దగ్గరకు చేరతాం... మన సొంత గడ్డమీద ఖననం చేస్తే, భూమి మీదే వుండిపోతాం. అయినవాళ్ళకు రుద్రభూమిలో అగ్నిసంస్కారంచేస్తే, అశ్వమేధయాగం చేసినంత పుణ్యం వస్తుందని చెబుతారు.

మామూలు మనిషి ఋషుల్లా యజ్ఞాలు, యాగాలు ఎటూ చేయలేదు. కనీసం అయినవాళ్ళ చితికి నిప్పుపెడితే యాగఫలం సిద్ధిస్తుందని పెద్దవాళ్లు చెబుతూ వుంటారు" అని చెప్పాడు.

తను నాన్న చెప్పినట్లే చేశాడు.

అమ్మ చనిపోయి ఐదేళ్ళు అయినా ఇంకా ఇంట్లో కలియ తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. ఆ అడుగుల సవ్వడి గుండెలో మోగుతూనే వుంది.

తెల్లవారు ఝామున నిద్రలేచి వాకిలి ఊడ్చేది. మసకచీకట్లోనే పశువుల చావిడిలో చేరి పాలు పిండేది. పెరుగుమీగడతో వున్న కుండలో కవ్వం తిప్పి మజ్జిగ చిలికేది. అమ్మది అమృతహస్తం... ఏది చేసినా అమృతంలా వుండేది. పెరుగు, పాలు అమ్ముకునేది కాదు. బీచాబిక్కికి మజ్జిగ పోసేది.

ఇంటిముందున్న మామిడిచెట్టు అమ్మ నాటిందే.

మనుమరాలుని చూసి మురిసిపోయేది.

"అమ్మాయి పుత్తడిబొమ్మరా! మంచి అల్లుడిని తెచ్చుకుని ఇల్లరికం ఉంచుకో! అమ్మాయిని సంపన్న కుటుంబంలో ఇస్తే నీ దగ్గర పిల్లని వుండనివ్వరు. పెట్టుపోతలకి ఇల్లు, వాకిలి అమ్ముకోవాలి! అందుకనే లేని కుటుంబం కుర్రాడిని అల్లుడిగా చేసుకో" అనేది. తాను మౌనంగా విన్నాడు.

అంతిమక్షణాల్లో మనవరాలిచేత నోట్లో తులసి తీర్థం పోయించుకుంది. ఇప్పటికీ వాళ్ళిద్దరూ ఇంటిముందు ఆరుబయట మంచాలు వేసుకుని మాట్లాడుకుంటున్నట్లుగా వుంటుంది. ఎందుకో – వాళ్ళు చనిపోయారనే భావన కలగదు తనకు.

తల్లిదండ్రులకు, తనకు మధ్య అనుబంధాన్ని దృఢం చేసిన సొంతిల్లును అమ్ముకుంటాడా?

ఇల్లు అమ్ముకుంటే!....

ఇక్కడో ఏడంతస్థుల మేడ వెలుస్తుంది. ఆ ఉక్కుకట్టడం పునాదిలో తన పూర్వీకుల ఇల్లు పెళ్ళలు పెళ్ళలుగా విరిగి మట్టిలో కలిసిపోతుంది. పూలమొక్కలు తలలు ఊపడం మానేస్తాయి.... పక్షులు ఎగిరిపోతాయి... ఆవరణలో పచ్చటి చెట్లు కూలిపోతాయి. వాహనాల చప్పుడుకు తన తల్లిదండ్రుల అడుగుల సవ్వడి వినిపించదు.

మార్పును వ్యతిరేకించడంలేదు తను. నిరంతర పచ్చదనాన్ని పంచుతూ సహజ స్వేచ్ఛ వాతావరణం తిరిగిరాదనదే తన బాధ. భారీ కట్టడంలో తన ఆత్మీయుల స్పర్శ వుండదు.

ఓ అరగంటసేపు ఊళ్ళో కబుర్లు చెప్పి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు మంగయ్య.

"నాన్నా! కాఫీ తాగువుదువుగాని లోపలికి రా" ఇంట్లో నుంచి వచ్చి పిలిచింది జలజ.

స్నానంచేసి చక్కగా ముస్తాబై తల్లో కనకాంబరాలు తురుముకుని మహాలక్ష్మిలా కనిపించింది కూతురు. ఆప్యాయంగా ఆ అమ్మాయి తలనిమిరి ఇంట్లోకి నడిచాడు వెంకయ్య.

ఇరవయేళ్ళు వచ్చాయి.... వెంటనే మంచి సంబంధం చూసి పెళ్లిచేసెయ్యాలి.... కనకయ్య ఏదో సంబంధం గురించి చెప్పాడు.... వాళ్ళ బావమరిదికి తెలిసినవాళ్ళట ....... బ్యాంక్‌లో ఉద్యోగమట. కట్నాలు కానుకల్లో ఇబ్బందేమి వుండదన్నాడు.

జలజను ఊళ్ళో పెళ్ళిలో చూశారట... బాగా నచ్చింది అమ్మాయి వాళ్ళకి. అన్ని వివరాలూ కనకయ్యతో మాట్లాడాలి... మంచిరోజు చూసుకుని పెళ్ళి చూపులకు రమ్మని చెప్పాలి.

కాఫీ తాగలేక కనకయ్య ఇంటికి బయల్దేరబోయాడు వెంకయ్య భుజంమీద కండువా వేసుకుని. ఇంతలో ఏదో గుర్తుకు వచ్చింది.

ఈ మధ్య ఊళ్ళోకి కోతి ఒకటి వచ్చింది. చెట్ల కొమ్మలమీద చేరి కాయలు కొరికి నేలమీదకు విసిరివెయ్యడం, ఎవ్వరూ గమనించకపోతే ఇంట్లో దూరి ఇల్లంతా పాడుచేస్తుంది.

దొడ్లోని మామిడిచెట్టు బాగా కాపుకాసింది. రసాలు, రేపో, ఎల్లుండో కాయలు కోసెయ్యాలి. జాగ్రత్తగా కాపలాకాస్తే కాయలు దక్కుతాయి.

"ఊళ్ళో కోతి తిరుగుతూ వుంది.... మన మామిడిచెట్టు ఎక్కి కాయలన్నీ తుంపి పడేస్తుందేమో... కర్రతో, రాళ్ళతో అదిలించు.... పారిపోతుంది. ఒకటో రెండో కాయలు తిని దాని దోవన అదిపోతే ఫరవాలేదు.... కాయలన్నీ కొరకివేస్తుంది. నేను తిరిగివచ్చే వరకూ బయటే కుర్చీ వేసుకుని కూర్చుని కాపలా కాయి" జలజతో అన్నాడు వెంకయ్య.

❖ ❖ ❖

తాయారమ్మ ఇంటిముందు నుంచి వెళ్తుంటే నౌకరుతో కబురుచేసింది.

"ఒక్కసారి వచ్చివెళ్ళమన్నారండి."

తాయారమ్మ ఇంట్లోకి అడుగుపెట్టాడు అయిష్టంగానే. "ఈ రోజు మంచిరోజు... నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలనుకున్నాను.... నీ జీవితంలోకి నన్ను అడుగుపెట్టనివ్వలేదు. నా కొడుకునన్నా నీ ఇంట్లో అడుగుపెట్టనివ్వు. మా వాడిని నీ అల్లుడిగా చేసుకో" అంది తాయారమ్మ.

వెంకయ్య మదిలో తాయారమ్మ కొడుకు రవిబాబు మెదిలాడు. వడ్డీ వ్యాపారం చేస్తుంటాడు. రైతుల భూములు చౌకగా కొని ప్లాట్లు వేసి అమ్ముతుంటాడు.. డబ్బు సంపాదనలో తాయారమ్మ కంటే రెండు ఆకులు ఎక్కువే చదువుకున్నాడు..... అన్ని అవలక్షణాలూ వున్నాయి. తన కూతుర్ని వాడికి కట్టబెడితే తన ఇల్లు పెళ్ళి అయిన మరుక్షణంలోనే కూల్చివేసి షాపింగ్ మాల్ కట్టిస్తాడు.

అయినా తాయారమ్మ మాట తను వినాల్సిన పనేంలేదు. ఆమె దగ్గర పైసా అప్పు తీసుకోలేదు.... తన కూతురు మాత్రం ఇందుకు ఒప్పుకుంటుందా? కాటుక కంటినీరు ఒలికించదూ?

"మా అమ్మాయిని మీ వాడికి ఇవ్వనని, కుండ బద్దలు కొట్టినట్లు చెప్పడం ఎందుకు?... ఏదో ఒక అబద్ధం చెప్పేస్తే పోలా!..." అనుకున్నాడు.

"మా అమ్మాయి ఎవరినో ప్రేమించిందంట.....ఆ అబ్బాయినే పెళ్ళి చేసుకుంటానని మంకుపట్టు పడుతోంది" అన్నాడు వెంకయ్య.

తాయారమ్మ పెద్దగా నవ్వింది.

ఆమె ఎందుకు అలా నవ్వుతోందో అర్థంకాలేదు వెంకయ్యకు.వెనుదిరిగాడు అతను.

"నీ కూతురు అందాలరాశి..... నీ ఇంటి స్థలం కోటి రూపాయలపైన పలుకు తుంది. నీతో వియ్యమందడానికి అందరూ ముందుకు వస్తారు. మా వాడిని కూడా నీ దృష్టిలో పెట్టుకో! పదికోట్ల ఆస్తివుంది మాకు.... అదంతా నీ కూతురిదే అవుతుంది" అంది తాయారమ్మ గేటుదాకా వెంకయ్యతోపాటే నడిచివస్తూ.

❖ ❖ ❖

కనకయ్య చెప్పిన వివరాలబట్టి చూస్తే జలజకు తగిన సంబంధమనిపించింది. అబ్బాయి కూడా అందంగా వున్నాడనుకున్నాడు ఫోటో చూడగానే. అబ్బాయి తల్లిదండ్రులతో మాట్లాడి ఎలాగైనా సంబంధం ఖాయం చేసుకోవాలి. తనతో వియ్యమందడానికి వాళ్ళూ ఇష్టపడుతున్నారట.

ఏనుగును ఎక్కినంత సంబరంతో ఇంటికి తిరిగి వచ్చాడు వెంకయ్య. వీధిగుమ్మం దాటి ఇంటి ఆవరణలోకి అడుగుపెట్టగానే అతని దృష్టి మామిడిచెట్టుపై గంతులేస్తున్న కోతిపై పడింది.

అప్పటికే చాలాకాయలు కొరికి కిందపడవేసింది కోతి. చిన్నచిన్న కొమ్మలు అంతటా విరిగిపడి వున్నాయి. కాయలతో నిండుగా కనిపించే మామిడిచెట్టు కళావిహీనంగా కనిపించిందది..

జలజను కాపలాకాయమని చెప్పినా ప్రయోజనం లేకపోయింది. కోతిని అదిలించి వెళ్ళగొట్టాడు. జలజ ఏంచేస్తున్నట్లు?

ఇంటి తలుపులు వేసున్నాయి.

తలుపులు బిగించి నిద్రపోతున్నదా? ఒళ్ళు తెలియకుండా పగలు నిద్ర ఏమిటి?

విసుక్కుంటూ తలుపుతట్టాడు వెంకయ్య.

తలుపు తియ్యగానే కనిపించిన తండ్రిని చూసి తొట్రుపాటుపడింది జలజ. "అప్పుడే వచ్చేశారా" అంది చెదిరిన దుస్తులు సవరించుకుంటూ.

పడకగదిలో ఏదో చప్పుడు వినిపించి అటుకేసి నడిచాడు వెంకయ్య. ఆ గదిలో వున్న తాయారమ్మ కొడుకును చూడగానే కొమ్మలు, రెమ్మలు రాల్చి మోడులా మిగిలిన వృక్షంలా నిలబడిపోయాడు. నోటిమాటలేదు వెంకయ్యకు.

కాలం మడతల్లో ఒదిగిపోయిన తండ్రి, తాత ముత్తాతల అడుగుల సవ్వడిని వింటూ వుండిపోయాడేగాని, పిల్లిలా తన ఇంటిచుట్టూ కంటపడకుండా తిరుగుతున్న తాయారమ్మ కొడుకు అడుగుల చప్పుడును తాను గమనించలేదు.

అందుకు తగిన మూల్యం చెల్లించుకున్నాడు.

బుల్‌డోజర్‌తో ఇల్లు పడగొడుతున్న చప్పుడు చెవుల్లో మారుమోగుతుండగా-

నిట్టూర్పు విడిచాడు వెంకయ్య.

- స్వాతి మాసపత్రిక, డిసెంబరు 2007